Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

## RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి | సంపుటి (Vol) : 6 | సంచిక (Issue) : 342 | పేజీలు (Pages) : 4 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 24 - 5 - 2025

94406 62699 | rajadhanivartalu | rajadhaniv | www.rajadhanivartalu.com | RNI No.: APTEL/2019/77985 | స్థాపితం : 2015

# భారత సైన్యాన్ని మెచ్చుకున్న అమిత్ షా.. అసలు కారణమిదే..




**ఢిల్లీ:** దేశ రాజధానిలో జరిగిన 22వ బీఎస్ఎఫ్ పదవి పురస్కార కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్'ను ప్రశంసించారు. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, బీఎస్ఎఫ్, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అద్భుతంగా పనిచేశాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతమైందన్నారు. గతంలో పాకిస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన దాడులకు ఆయా ప్రభుత్వాలు తగిన సమాధానం ఇవ్వలేదని అమిత్ షా విమర్శించారు. కానీ 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మారిందన్నారు. ఉగ్రవాద దాడులకు గట్టి సమాధానం ఇవ్వడమే కాదు, భారత్ అంటే ప్రపంచానికి తెలిసేలా చేశామన్నారు అమిత్ షా.

**ఉరీ, సర్జికల్ స్ట్రైక్**

2014లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఉరీలో జరిగిన దాడి దేశాన్ని కలచివేసింది. ఈ దాడిలో భారత సైనికులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చారు. దీనికి సమాధానంగా భారత సైన్యం మొదటిసారిగా శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి సర్జికల్ స్ట్రైక్ నిర్వహించింది. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసింది. ఈ సర్జికల్ స్ట్రైక్ ప్రపంచ వ్యాప్తంగా భారత సైన్యం శక్తిని చాటిచెప్పింది.

**పుల్వామా ఎయిర్ స్ట్రైక్**

ఉరీ దాడి తర్వాత, 2019లో పుల్వామాలో మరో దాడి జరిగింది. ఈ దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సమాధానంగా భారత వైమానిక దళం ఎయిర్ స్ట్రైక్ నిర్వహించి, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత్.. సాయుధ బలగాల సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది.

**పహల్గామ్ దాడికి, ఆపరేషన్ సిందూర్**

ఇటీవల పహల్గామ్‌లో పాకిస్థాన్ ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను వారి మతం ఆధారంగా గుర్తించి హతమార్చారు. ఈ దారుణ ఘటనకు సమాధానంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు, ప్రధానమంత్రి మోదీ రాజకీయ దృఢత్వం కలిసి పనిచేశాయి. చివరకు ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తైంది. ఈ సందర్భంగా ప్రపంచం మొత్తం ఇప్పుడు భారత సైన్యాన్ని ప్రశంసిస్తున్నాయని షా వెల్లడించారు.

**బీఎస్ఎఫ్ పాత్ర**

ఈ సందర్భంగా బీఎస్ఎఫ్‌ను అమిత్ షా మెచ్చుకున్నారు. భారతదేశానికి అత్యంత సవాలుతో కూడిన సరిహద్దులైన బంగ్లాదేశ్, పాకిస్థాన్ రక్షణ బాధ్యతను బీఎస్ఎఫ్‌కు అప్పగించినట్లు ప్రస్తావించారు. ఈ క్రమంలో బీఎస్ఎఫ్ ఆ బాధ్యతను అద్భుతంగా నిర్వర్తిస్తోందని అమిత్ షా అన్నారు. మీ సామర్థ్యంతో ఈ సరిహద్దులను గొప్పగా కాపాడారని షా కొనియాడారు. ఈ క్రమంలో ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం మరోసారి తన శక్తిని నిరూపించిందన్నారు. పహల్గామ్ దాడి తర్వాత, ప్రధానమంత్రి మోదీ తగిన సమాధానం ఇస్తామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఆ వాగ్దానాన్ని నెరవేర్చినట్లు చెప్పారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చిందన్నారు కేంద్రమంత్రి అమిత్ షా.


# ఆర్గానిక్ ఉత్పత్తులకు కొత్త ప్రపంచం



**న్యూఢిల్లీ :** దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు ఓ వైవిధ్యం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ వైవిధ్యమే ఈశాన్య రాష్ట్రాలకు బలమని ఆయన స్పష్టం చేశారు. భారతదేశమే ఒక వైవిధ్య భరితమైన దేశమని, అలాంటి దేశంలో ఈశాన్య రాష్ట్రాల ప్రాంతం అత్యంత వైవిధ్యభరితమైన భాగమని అభివర్ణించారు. శుక్రవారం న్యూఢిల్లీలో రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాల వైవిధ్యానికి వాణిజ్యం నుంచి సంప్రదాయం వరకు, వస్త్ర రంగం నుంచి పర్యాటకం వరకూ బలాన్ని ఇస్తుందన్నారు. టీ, వెదురు ఉత్పత్తులు, సహజ వాయువు, క్రీడలు, నైపుణ్యానికి ఈశాన్య రాష్ట్రాలు పర్యాయ పదమని చెప్పుకొచ్చారు. ఇక ఆర్గానిక్ ఉత్పత్తులకు సైతం ఈ రాష్ట్రాలు కొత్త ప్రపంచమని కీర్తించారు. అలాగే దేశానికి ఈశాన్య ప్రాంతం శక్తి కేంద్రమన్నారు. కానీ తమకు మాత్రం ఈ రాష్ట్రాలు అష్టలక్ష్ములతో సమానమని ఆయన అభివర్ణించారు. ఈస్ట్ అంటే దిశ మాత్రమే కాదని.. ఈస్ట్. అంటే ఎంపావర్ (సాధికారత), యాక్ట్ (చర్య), స్ట్రేంథెన్ (బలోపేతం), పరివర్తన ( ట్రాన్స్‌ఫారమ్) అంటూ ప్రధాని మోదీ వివరించారు. గతంలో ఈశాన్య రాష్ట్రమంటే.. సరిహద్దు ప్రాంతంగా మాత్రమే అంతా భావించేవారని గుర్తు చేశారు. కానీ ఆయా రాష్ట్రాలు నేడు అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్నాయన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు.. పర్యాటక రంగాన్ని ఆకర్షణీయంగా చేస్తాయన్నారు. అంతేకాకుండా అవి పెట్టుబడిదారులకు మరింత విశ్వాసాన్ని అందిస్తాయని చెప్పారు. ఈశాన్యంలో తాము మౌలిక సదుపాయాల విప్లవాన్ని ప్రారంభించామని.. అది ప్రస్తుతం అవకాశాల భూమిగా మారుతోందని చెప్పారు. ఈశాన్యంలో అనుసంధానత మరింత బలపడుతోందని ఈ సందర్భంగా ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలోని సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈశాన్య ప్రాంతం పాత్ర బలపడుతోందన్నారు. దేశాభివృద్ధిలో ఈశాన్య రాష్ట్రాల ప్రాముఖ్యతను ప్రధాని మోదీ ఈ సందర్భంగా సోదాహరణగా వివరించారు. ఈశాన్య ప్రాంతంలోని ప్రతి రాష్ట్రం పెట్టుబడులకే కాదు.. నాయకత్వానికీ సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తుందన్నారు. వికసిత్ భారత్‌లో భాగంగా తూర్పు భారతదేశం ప్రాముఖ్యతను ప్రధాని మోదీ వివరించారు.

# కరోనా కలకలం.. ఏపీలో మరో కేసు

**కడప, (రాజధాని వార్తలు):** ఏపీలో కరోనా కేసులు నమోదు కలకలం రేపుతోంది. కడపలో కరోనా పాజిటివ్ కేసు నమోదు అయ్యింది. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన 75 ఏళ్ల మహిళ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కడప రిమ్స్‌లో చేరింది. వృద్ధురాలికి తీవ్ర జ్వరం ఉండటంతో అనుమానించిన వైద్యులు గత రాత్రి కరోనా పరీక్షలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమెకు కరోనా సోకినట్లు రిమ్స్ వైద్యులు తేల్చారు. వృద్ధురాలికి వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. ఇక కడప జిల్లాలో మరోసారి మొదటిగా ఒక కరోనా కేసు వెలుగులోకి రావడంతో జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నిన్న విశాఖలో ఓ మహిళకు కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఏపీలో ఇప్పటి వరకు రెండు కరోనా కేసులు నమోదు అయ్యాయి. విశాఖలో వివాహితకు కరోనా పాజిటివ్ అని తేలింది. మద్దెలపాలెంలోని పిఠాపురం కాలనీకి చెందిన 28 ఏళ్ల మహిళకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వివాహిత చలి జ్వరం, తీవ్రమైన దగ్గుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. వైద్య పరీక్షల్లో కోవిడ్ 19గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆరోగ్య శాఖ అధికారులు కేజీహెచ్‌లో మరోసారి శాంపిల్‌ను పరీక్షించగా అది కూడా పాజిటివ్‌గానే నిర్ధారణ అయ్యింది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండగా వైద్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయగా హోం ఐసోలేషన్‌లో ఉంచారు. ఆ వెంటనే ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మద్దెలపాలెంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. వివాహిత కుటుంబ సభ్యులందరికీ కరోనా పరీక్షలు నిర్వహించేందుకు నమూనాలు సేకరించి కేజీహెచ్‌కు



పంపించారు. వారందరూ కూడా హోం ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. కాగా.. ఇప్పటికే ఏపీ వైద్య ఆరోగ్య శాఖ కరోనాకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన ఆదేశాలిచ్చింది. గ్రూప్‌గా ఉన్న చోట తిరగవద్దు అంటూ పలు ఆదేశాలను ఈనెల 21నే వైద్య ఆరోగ్య శాఖ ఇచ్చింది. ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాస్కులు కచ్చితంగా వాడాలని పేర్కొంది. అలాగే చలి జ్వరం, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి-వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాల నొప్పులు, బాడీ పెయిన్స్, ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. రైల్వేస్టేషన్లు , బస్టాండ్లు విమానాశ్రయాలు వంటి వాటిలో కోవిడ్ నిబంధనలు పాటించాలని ఏపీ ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది.

# కేంద్రమంత్రి జితేంద్రసింగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ.. ఏం చర్చించారంటే...

**న్యూఢిల్లీ :** హస్తినలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. కేంద్ర మంత్రులతో చంద్రబాబు వరుసగా భేటీలు అవుతున్నారు. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, భూ విజ్ఞాన శాఖల మంత్రి జితేంద్ర సింగ్‌తో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అంతరిక్ష తయారీ, ఆవిష్కరణలకు కీలక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు కోరుతూ ఒక సమగ్ర ప్రతిపాదనను సీఎం సమర్పించారు. ఈ ప్రతిపాదనలో రాష్ట్ర మద్దతుతో రెండు స్పేస్ సిటీల అభివృద్ధికి సంబంధించిన వివరాలున్నాయి. వీటిలో ఒకటి ఇస్రో షార్ అంతరిక్ష కేంద్రం సమీపంలో, మరొకటి లేపాక్షి వద్ద ఉంటాయి. ఉపగ్రహాల ఉత్పత్తి, ప్రయోగ వాహనాల అభివృద్ధి, పరిశ్రమల సహకారానికి ఇవి సమగ్ర కేంద్రాలుగా ఉపయోగపడనున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అంతరిక్ష సాంకేతికత సలహాదారుగా ఇస్రో మాజీ ఛైర్మన్ డా.ఎస్. సోమనాథ్ నియామకం గురించి కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా తెలియజేశారు. ఆయన మార్గదర్శకత్వంలో అంతర్జాతీయంగా పోటీపడే అంతరిక్ష ఎకోసిస్టంను నిర్మించడంలో రాష్ట్ర ప్రయత్నాలకు ఈ నియామకం దిశానిర్దేశం చేస్తుందని వివరించారు. వ్యూహాత్మక స్థానం, పారిశ్రామిక బలం, భవిష్యత్తుకు సిద్ధమైన మౌలిక సదుపాయాలతో, భారతదేశ అంతరిక్ష రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. కేంద్రం ఈ విప్లవాత్మక మార్పులను గుర్తించి, తగిన భాగస్వామ్యం కల్పిస్తుందనే ఆశాభావాన్ని ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు. అంతకుముందు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం కలిశారు. ఈ సమావేశంలో పోలవరం - బనకచెర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనను సమర్పించారు. గోదావరి వరద నీటిని ఏపీలోని కరువు పీడిత ప్రాంతాలకు మళ్లించడమే ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు లక్ష్యం. జల్ జీవన్, బ్లూ



రివల్యూషన్, మేక్ ఇన్ ఇండియా వంటి జాతీయ మిషన్ల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత దిగువ రాష్ట్రంగా మిగులు జలాలపై ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న హక్కును కూడా ఈ సందర్భంగా సీఎం వెల్లడించారు. పోలవరం-బనకచెర్ల అనుసంధాన ప్రాజెక్టుకు సంబంధించిన వివరాల డీపీఆర్ త్వరలో సమర్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పనులను త్వరగా ముందుకు తీసుకెళ్లడానికి తక్షణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని సీఎం చంద్రబాబు అభ్యర్థించారు. కాగా.. ఈరోజు (శుక్రవారం) ఉదయం కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో సీఎం సమావేశమై... ఏపీలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు సహకారంపై చర్చించారు. పీఎం సూర్యఘర్ యోజన కింద 20 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలకు సోలార్ రూఫ్ టాప్ కేటాయింపులు ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరారు. కేంద్రం సహకరిస్తే పునరుద్పాదన ఇంధన వినియోగంలో ఏపీ.. భవిష్యత్‌లో దేశానికి మార్గనిర్దేశం చేయగలదని అన్నారు. ఆపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయిన సీఎం చంద్రబాబు.. ఏపీలో వ్యూహాత్మక రక్షణ, ఏరో స్పేస్ ప్రాజెక్టులపై చర్చించారు.

# తిరుపతిలో ఎలక్ట్రిక్ బస్సు చోరీ.. చివరకు..




**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతిలో ఎలక్ట్రిక్ బస్సు చోరీకి గురైంది. చింతల చేనులో పార్కింగ్‌లో ఉంచిన ఎలక్ట్రిక్ బస్సును గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. ఉదయాన్నే బస్సు కనపడకపోవడంతో సంబంధిత డ్రైవర్ బస్సు మేనేజర్‌కు సమాచారం అందించారు. ఎలక్ట్రిక్ బస్సు ఎంత వెతికినా కనిపించడంతో చివరికి ఈస్ట్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు బస్సును చివరికి కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం ఘాట్ రోడ్డులో ఉన్నట్లు గుర్తించారు.

కడప - రాయచోటి ప్రధాన రహదారిలోని ఘాట్ రోడ్‌లో ఎలక్ట్రిక్ బస్సు ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. ఘాట్ రోడ్డు లోని మలుపును తిప్పలేక చోరుడు ప్రమాదానికి గురై బస్సును అక్కడే వదిలి వెళ్ళినట్లు తెలుస్తోంది. కడప జిల్లా, చింతకొమ్మదిన్నె పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, చింతల చేనులో పార్కింగ్ చేసిన ఎలక్ట్రిక్ బస్సు విలువ రూ. కోటి 30 లక్షలు అని అధికారులు తెలిపారు. కాగా, ఇటీవల కాలంలో తిరుపతి, తిరుమల కొండపై దొంగలు ఎక్కువయ్యారు. భక్తుల ఫోన్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని వస్తువులోనూ మాత్రమే కాకుండా ఏకంగా ఎలక్ట్రిక్ బస్సును కూడా ఎత్తుకెళ్తున్నారు. ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. అంతేకాకుండా, భక్తుల ఉచిత ప్రయాణం కోసం టీటీడీ ఉపయోగించే ధర్మరథాన్ని కూడా దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన గతంలో జరిగింది. దీంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఈ విషయాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం..ఆరుగురి మృతి

**ఒంగోలు, (రాజధాని వార్తలు):** ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొమరోలు మండలం తాటిచెర్లమోటు వద్ద శుక్రవారం మధ్యాహ్నం కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. క్షతగాత్రులను గిద్దలూరు ప్రభుతాసుపత్రికి తరలించారు.

అయితే వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మరోవైపు మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్ట్‌మార్టం నిమి త్తం ఆయా మృతదేహాలను ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతులంతా స్టువర్ట్‌పురం వాసులను పోలీసులు తెలిపారు.

కారులోని వారంతా మహానంది వద్దనున్న మహాబలిపురం వెళ్లి.. బాపట్ల తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని వెల్లడించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వివరించారు. ప్రమాద సమయానికి ముందు కారు, లారీలు రెండు అధిక వేగంతో ప్రయాణిస్తున్నాయని.. అందుకే ప్రమాద తీవ్రత బాగా పెరిగిందని పోలీ సులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారంతా మరణించారని చెప్పారు. కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతిందని పేర్కొన్నారు. ఇక ఈ ప్రమాద ఘటనకు సంబంధించి.. సమీపంలోని పెట్రోల్ బంక్‌లోని సీసీ కెమెరాలో రికార్డు అయిందని తెలిపారు

# మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి చేతికి శస్త్ర చికిత్స

### - 14 రోజుల పాటు విశ్రాంతిలో ఉండాలన్న వైద్యులు






**కోవూరు, (రాజధాని వార్తలు):** వైసీపీ రాష్ట్ర సీనియర్ నేత అధికార ప్రతినిధి మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిచేతికి శస్త్రచికిత్స చేసారు. నెల్లూరు నగరములో ఏనెల్ ఆసుపత్రిలో గురువారం చేతికి ఆపరేషన్ చేసారు. ఈ నేపథ్యంలో ఆయన కనీసం 14 రోజుల పాటు విశ్రాంతిలో ఉండాలని వైద్యులు సూచించారు. ఈ పరిస్థితిలో ఎవరు వాట్సాప్‌లు మెసేజ్‌లు కానీ, ఫోన్‌లు ఎటువంటివి ఆయన దృష్టికి తీసుకు రావద్దని విన్నవించడం జరిగింది.

ఈ సమాచారంను ప్రసన్నకుమార్ రెడ్డి కార్యాలయం నుండి చెర వేశారు. ప్రస్తుతం చికిత్సలో మాజీ మంత్రి ప్రసన్న త్వరగా కోలుకోవాలని వైసీపీ నేతలు, కార్యక ర్తలు, అభిమానులు ఆకాంక్షించారు.

# కన్యకా పరమేశ్వరి కొలువులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరం స్టోన్ హౌస్ పేటలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి కొలువులో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ కమిటి సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు.

ఈ సందర్భముగా కన్యకా పరమేశ్వరి ఆలయంలో పుష్పాలంకారణతో ప్రత్యేకంగా రూపొం దించిన హనుమంతుల ప్రతిమను ఆమె దర్శించుకున్నారు. అనంతరం కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్ధ ప్రసాదాలు అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తో ముంగమూరు చైతన్య రెడ్డి, ఆడపాల అనీష్ రెడ్డి స్థానిక ఉభయ కర్తలు కమిటీ సభ్యులు స్థానిక భక్తులు తదితరులు ఉన్నారు.

# మహానాడు ఏర్పాట్లపై టీడీపీ నేతల భేటీ

### - సభ సక్సెస్‌కు రంగం సిద్ధం చేసే కోణంలో టీడీపీ పెద్దలు ఎంపీ వేమిరెడ్డి





**కడప/నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించనున్న మహానాడుసభ సక్సెస్‌కు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కీలకంగా కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా మహానాడు ఏర్పాట్లపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, సమన్వయ కమిటీ కోకన్వీనర్ పల్లా శ్రీనివాస్, కమిటీ సభ్యులు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి  కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఎంఎల్ఏ అమర్నాథ్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కడపలోని శ్రీనివాస్ రెడ్డి  నివాసంలో భేటీ అయిన నేతలు ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వసతులు కల్పినపై మాట్లాడారు. మరో నాలుగు రోజులే ఉన్నందున ఏర్పాట్లు వేగంగా చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

కనీవిని ఎరుగని రీతిలో మహానాడు జరగాలని, ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోవాలన్నారు. భేటీలో కేతంరెడ్డి వినోద్ రెడ్డి, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. గతములో జరగని విదంగా నూతన ఒరవడితో మహానాడు నాడు సభ జరిగే విదంగా టీడీపీ శ్రేణులు కృషి చేస్తున్నారు.

# వక్ఫ్ బిల్లు సవరణ చట్టంపై తీర్పు రిజర్వ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన న్యాయమూర్తి

**న్యూఢిల్లీ:** వక్ఫ్ బిల్లు సవరణ చట్టం-2025 రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో గురువారం ఆసక్తికర చర్చ జరిగింది. ఈ పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టును రిజర్వ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టంలో మూడు ముఖ్యమైన అంశాలపై అభ్యంతరాలు వచ్చాయి. ముఖ్యంగా కోర్టులు వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తిరిగి డీనోటిఫై చేసే అధికారంపై వివాదం నెలకొంది.

ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ వాదనలు ఆసక్తికరంగా సాగాయి. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, రాజీవ్ ధావన్, అభిషేక్ మను సింఘ్వి వాదించారు. ఈ చర్చల సమ యంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ.. వక్ఫ్ అనేది దేవునికి అంకితమని, మరణానంతర జీవితం కోసంచేసే దానం అని అన్నారు. ఇతర మతాల మాదిరిగా కాకుండా, వక్ఫ్ అనేది దేవునికి చేసే దాతృత్వం అని అభివర్ణించారు. కపిల్ సిబల్ వాదనపై ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ స్పందించారు. మతపరమైన దానం అనే భావన ఇస్లాంకు మాత్రమే పరిమితం కాదని అన్నారు.

హిందూ మతంలో కూడా మోక్షం పేరుతో దానాలను ప్రోత్సహిస్తారని గుర్తు చేశారు. అలాగే దాతృత్వం అనేది అన్ని మతాల ప్రాథమిక భావన అని స్పష్టం చేశారు. కాగా, వివాదాస్పద వక్ఫ్ బిల్లు సవరణ చట్టాన్ని తాత్కాలికంగా నిలిపి వేయాలన్న విజ్ఞప్తిపై ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తన ఉత్తర్వులను రిజర్వ్ చేసింది.

# విద్యుత్ పోల్స్ ఏర్పాటు...మౌలిక కల్పనకు తన్నీరు కృషి

### - బీజేపీ, ఇంచార్జి తన్నీరు వెంకట సుబ్బారావు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరములోనిఎన్డ్ ఆర్ లే అవుట్ 15 ఏళ్ల క్రితం నుండి వీధి విద్యుత్ దీపాలు లేక చీకటిలో ఉం టున్న నేపథ్యంలో ఈ ప్రాంతం నూతనంగా విద్యుత్ పోల్స్ వేసి విద్యుత్ సౌకర్యలను ఏర్పాటు చెయ్యడం జరిగింది అని బీజేపీ 10వ డివిజన్ ఇంచార్జి తన్నీరు వెంకట సుబ్బారావు అన్నారు. లే అవుట్‌లో ఉన్న వారందరికీ వందలాది మందికి కాంతిని కలిగించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ విషయములో విద్యుత్ శాఖ, స్థానిక లే అవుట్ యజమానులు అందరూ సహ కారంతో ఈ పని చేయకలిగామని చెప్పారు. సహకరించిన అందరికి అభినందనలును తన్నీరు తెలిపారు.

# తెలుగు జాతి గర్వపడేలా మహానాడు నిర్వహణకు టీడీపీ పెద్దలు కసరత్తు

### - చరిత్రలో నిలిచే విధంగా సభ నడవాలి - ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి





**కడప, (రాజధాని వార్తలు):** ఈ మాసం చివరలో 3 రోజుల పాటు కడపలో నిర్వహించనున్న మహానాడు ఏర్పాట్లను సమన్వయ కమిటీ సభ్యులు, ఎంపీ వేమిరెడ్డి సభాస్థలమును పరిశీలించారు. పరిశీలనలో  కడప టీడీపీ అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా కడపలో మహానాడును నిర్వహించుకోవాలని మహానాడు సమన్వయ కమిటీ సభ్యులు, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం మధ్యాహ్నం కడపలో మహానాడు నిర్వహించనున్న ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. ఎంపీ వేమిరెడ్డితో కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను వేమిరెడ్డి పరిశీలించారు. ఇప్పటివరకు చేసిన పనులపై అడిగి తెలుసుకున్నారు. భారీగా తరలిరానున్న నాయకులు, కార్యకర్తల వసతులకు సంబంధించి ఆరా తీశారు.

అనంతరం ఆయన పలు సూచనలు చేశారు. ఎంపీ వేమిరెడ్డితో టిడిపి నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, రవీంద్ర రెడ్డి తదితరులు ఉన్నారు.

# వైభవంగా హనుమాన్ జయంతి శోభాయాత్ర





**బుచ్చి, (రాజధాని వార్తలు):** ధైర్య సాహసాలకు ప్రతీకా, హనుమంతులు ధైర్య సాహసాలకు ప్రతీకని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. హనుమంతులు జై శ్రీరామ్ నినాదాలతో ప్రతిధ్వ నించిన స్వామికి భక్తి బలం, బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో  హనుమ జయంతి సందర్భంగా బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ హనుమాన్ జయంతి శోభాయాత్రలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బుచ్చి పట్టణంలో డిఎల్ఎన్ఆర్ హై స్కూల్ నుంచి కోదండ రామాలయం వరకు సాగిన బైక్ ర్యాలీలో యువకులు ఉత్సా హంగా పాల్గొన్నారు.

బుచ్చి పట్టణంలో జై శ్రీరామ్ నినాదాలు ప్రతిధ్వనించాయి. శ్రీ ఆంజనేయ స్వామి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాం క్షలు తెలియచేసారు. యువత నిర్వహిస్తున్న ఈ బైక్ ర్యాలీ హనుమంతుల వారి పట్ల భక్తికి, ధైర్య సాహసాలకు గుర్తుగా జరుపుకొంటున్న ఓ సంబర యాత్రను తలపిస్తుంది. శ్రీరాముల సేవలో  ఆంజనేయ స్వామి చూపిన అంకితభావం, విశ్వాసం నిజమైన భక్తికి కొలమానాలన్నారు. మనం ఏ మార్గంలో నడిచినా, అది ధర్మమార్గం కావాలన్నారు. హనుమంతుల వారి ఆదర్శాలు పాటిస్తూ, దేశం కోసం, సమాజం కోసం సేవ చేయాలని యువతకు హితోపదేశం చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, బుచ్చి పట్టణ కౌన్సిలర్లతో పాటు బుచ్చి మండల టిడిపి అర్బన్, రూరల్ మండల అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్, టిడిపి సీనియర్ నాయకులు హరికృష్ణ, ఎంవి శేషయ్య, సూరా శ్రీనివాసులు రెడ్డి హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు దర్శి బాలనరసింహారావు, గంజం పెంచల ప్రసాద్, పెట్లూరి, మోర్ల మురళి, చీర్ల ప్రసాద్, క్రిష్ణయ్య, కుడుముల విజయకృష్ణ, ఆలూరు వెంకటసుబ్బయ్య తదితరులుఉన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతి రాకతో స్థానిక నాయకులు, భక్తులు సంతోషం వ్యక్తం చేసారు.

# ఎస్ఎస్ఎంబి29 నెక్ట్స్ షెడ్యూల్ అప్డేట్



ఆర్ఆర్ఆర్ తర్వాత దర్శక ధీరుడు రాజమౌళి టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఫారెస్ట్ అడ్వెంచర్ యాక్షన్ మూవీగా తెరకెక్కుతున్న ఈ సినిమా కనీసం అనౌన్స్‌మెంట్ కూడా లేకుండానే సెట్స్ పైకి వెళ్లింది. రాజమౌళి ఈ సినిమాను ఎంతో వేగంగా పూర్తి చేయాలని డిసైడయ్యాడు. అందులో భాగంగానే ఇప్పటికే జక్కన్న రెండు షెడ్యూల్స్‌ను కూడా పూర్తి చేశాడు. మహేష్ కెరీర్‌లో 29వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఎస్ఎస్ ఎంబీ29 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతుంది. ప్రస్తుతం చిత్ర యూనిట్ సమ్మర్ బ్రేక్‌లో ఉంది. ఈ గ్యాప్‌లో రాజమౌళి లండన్ వెళ్లి అక్కడ రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో జరిగిన ఆర్ఆర్ ఆర్ లైవ్ కాన్సర్ట్‌లో పాల్గొనగా, మహేష్ ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు విదేశాలకు వెళ్లాడు. దీంతో ఎస్ఎస్ఎంబీ29 షూటింగ్ మళ్లీ ఎప్పుడు మొదలవుతుందనే ఆసక్తి అందరి లోనూ నెలకొంది. ప్రస్తుతం రాజమౌళి మరియు అతని టీమ్ ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్‌ను ప్లాన్ చేస్తున్నారట. జూన్ 1 నుంచి హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ తిరిగి ప్రారంభమవుతుందని తెలుస్తోంది. ఈ షెడ్యూల్ లో ఒక స్పెషల్ సెట్‌లో కొన్ని కీలక సన్నివేశాలను తెరకెక్కించను న్నాడట జక్కన్న. హైదరాబాద్ షెడ్యూల్‌లో పలు కీలక ఎపిసోడ్స్‌ను షూట్ చేసి అది పూర్తయ్యాకే చిత్ర యూనిట్ ఆ నెక్ట్స్ షెడ్యూల్ కోసం విదేశాలకు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం జూన్ 1 నుంచి హైదరాబాద్‌లో మొదలవనున్న ఈ షెడ్యూల్‌లో మహేష్ బాబుతో పాటూ ప్రియాంక చోప్రా కూడా పాల్గొననున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే మహేష్ కూడా అతి త్వరలోనే విదేశాల నుంచి హైదరాబాద్‌కు తిరిగి రానున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే ఈ సినిమా ఎక్కువగా ఆఫ్రికాలోని కొన్ని ప్రదేశాల్లో జరగనుంది. రాజమౌళి మరియు అతని టీమ్ ఇప్పటికే లొకేషన్స్‌ను వెతికి లాక్ చేసుకున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ సినిమాను కె.ఎల్ నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

# బన్నీ కోసం అట్లీ ఐదుగురిని ఫిక్స్ చేస్తున్నాడా?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ – అట్లీ కాంబోలో భారీ పాన్ వరల్డ్ మూవీకి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అత్యంత భారీ స్థాయిలో హాలీవుడ్ టెక్నీషియన్స్ అండ్ ఆర్టిస్టులతో ఈ భారీ ప్రాజెక్ట్‌ని అత్యంత ప్రతిష్టాత్మకంగా దర్శకుడు అట్లీ తెరపైకి తీసుకొస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రస్తుతం జరుగుతోంది. ఇటీవలే హైదరాబాద్ వచ్చిన అట్లీ ఈ పనులను ప్రారంభించారు. హాలీవుడ్ సూపర్ హీరోల చిత్రాలకు ఏ మాత్రం తీసిపోని స్థాయిలో తెరకెక్కనున్న ఈ సినిమాలో బన్నీ మూడు విభిన్నమైన పాత్రల్లో కనిపించబో తున్నారు. మూడు వేరు వేరు ప్రపంచాల్లో జరిగే కథగా దీన్ని అట్లీ రూపొందిస్తున్నారు. ఈ సినిమా కోసం బన్నీకి జోడీగా పాపులర్ స్టార్స్ నటిస్తారంటూ కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. విజువల్స్ ఎఫెక్ట్స్‌కి పెద్ద పీట వేస్తున్న అట్లీ గ్లామర్ పరంగానూ జాగ్రత్తలు తీసుకుంటున్నాడట. ఇందులో భాగంగానే ఈ మూవీ కోసం ఏకంగా ఐదుగురు క్రేజీ హీరోయిన్‌లని ఫైనల్ చేస్తున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో ముందుగా బాలీవుడ్ క్రేజీ లేడీ దీపికా పదుకునే పేరు వినిపిస్తోంది. దీపికతో పాటు మృణాల్ ఠాకూర్, అనన్య పాండే, జాన్వీ కపూర్, భాగ్యశ్రీ బోర్సేలని కూడా సెలెక్ట్ చేయబోతున్నాడట. ఈ క్రేజీ కాస్టింగ్‌తో ఈ ప్రాజెక్ట్ హాట్ టాపిక్ కావాలన్నది అట్లీ ఆలోచనగా తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించి ఇంత వరకు ఎలాంటి అధికారిక ప్రకటన లేనప్పటికీ ఈ ఐదుగురు ఈ ప్రాజెక్ట్‌లో ఉంటారని మాత్రం ఇన్ సైడ్ టాక్. అయితే దీపిక పదుకునే విషయంలోనే అందరిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల షర తుల కారణంగా సందీప్‌రెడ్డి వంగ ప్రాజెక్ట్ స్పిరిట్‌నుంచి తప్పుకున్న దీపికని కంట్రోల్ చేయడం అట్లీకి వీలవుతుందా? అని అంతా చర్చించుకుంటున్నారు. అయితే మరి కొంత మంది మాత్రం జవాన్‌లో దీపికతో కలిసి వర్క్ చేసిన అట్లీకి అది పెద్ద మ్యాటరే కాదని, దీపికని తను కట్రోల్ చేయగలడని అంటున్నారు. మరి ఈ వార్తల్లో ఉన్న నిజమెంత అన్నది తెలియాలంటే టీమ్ అధికారికంగా స్పందించేంత వరకు వేచి చూడాల్సిందే.

# 'ది రాజసాబ్' టీజర్‌పై అప్‌డేట్ ఇచ్చేసాడు!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ కామెడీ హారర్ థ్రిల్లర్ 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహి స్తున్నారు. ఆయనకిది తొలి పాన్ ఇండియా మూవీ అండ్ భారీ బడ్జెట్ సినిమా కూడా. అంతే కాకుండా భారీ స్టార్‌తో మారుతి చేస్తున్న ఫస్ట్ మూవీ కూడా ఇదేయ కావడం గమనార్హం. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి.విశ్వ ప్రసాద్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ప్రభాస్ తన కెరీర్‌లో తొలిసారి చేస్తున్న కామెడీ హారర్ థ్రిల్లర్ మూవీ ఇది. ఇందులో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ది కుమార్ హీరోయి న్‌లుగా నటిస్తున్నారు. ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ బ్యాడ్‌మ్యాన్ సంజయ్‌దత్ కీలక పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. నయనతార స్పెషల్ సాంగ్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ దాదాపుగా ఎండింగ్ దశకు చేరుకుంది. ఇటీవలే హైదరాబాద్‌లో కీలక సన్నివేశాల చిత్రీకరణ మొదలు పెట్టారు. వెకేషన్ కోసం ఇటలీ వెళ్లిన ప్రభాస్ కూడా తిరిగి ఈ షూటింగ్‌లో పాల్గొ ననున్నారు. సంజయ్ దత్‌పై ఇటీవలే షూటింగ్ మొదలైంది. ఇదిలా ఉంటే ఈ మూవీ షూటింగ్‌తో పాటు టీజర్ రిలీజ్ గత కొన్ని రోజులుగా వాయిదా పడుతూ వస్తోంది. ఎట్టకేలకు బ్యాలెన్స్ షూటింగ్ స్టార్ట్ కావడంతో టీజర్ రిలీజ్‌పై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే యువ నిర్మాత ఎస్‌కెఎన్ ఈ మూవీ టీజర్ రిలీజ్‌పై క్రేజీ అప్ డేట్ ఇచ్చేశారు. మరో రెండు వారాల్లో టీజర్ రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని ప్రకటించారు. టీజర్ రిలీజ్‌కు అన్నీ సెట్ అయ్యాయని, టీజర్ వచ్చేస్తోందని, మారుతి కూడా హామీ ఇచ్చారని ఎస్‌కెఎన్ చెప్పడంతో ప్రభాస్ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. రాజా సాబ్ టీజర్ కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నామని ఫ్యాన్స్ సోషల్ మీడియమా వేదిగా గత కొంత కాలంగా రచ్చ చేస్తున్న విషయం తెలిసిందే. తాజా అప్ డేట్‌తో వారిలో సంబరాలు మొదలయ్యాయి. ఇప్పటికైనా టీజర్ రిలీజ్‌పై అప్ డేట్ వచ్చినందుకు ఆనం దంగా ఉందని సోషల్ మీడియాలో కామెంట్‌లు పెడుతు న్నారు. ఈ మూవీని తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారు. సినిమా షూటింగ్ ఆలస్యం కావడంతో ఓటీటీ డీల్ కూడా ఇంకా పూర్తి కాలేదని తెలిసింది.

# సందీప్‌రెడ్డి వంగకు ఈ యాటిట్యూడ్ ఉండాల్సిందే?



ఒక దర్శకుడు, లేదా హీరో స్ట్రాంగ్‌గా నిలబడ్డారు అంటే అది కేవలం అతని యాటిట్యూడ్ కారణం. ఇలాంటి వాళ్లు తను నమ్మిన దానికి స్టిక్ ఆన్ అయి ఉంటారు. ఎవరి మట వినరు. ఎవరి ప్రలోభాలకు లొంగరు. ఎవరెన్ని షరతులు విధించినా అంగీకరించారు. దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కూడా అలాంటి రకమే. 'అర్జున్‌రెడ్డి'ని ఇద్దరు హీరోలు చేయ డానికి భయపడినా ఆ స్క్రిప్ట్‌ని పక్కన పెట్టలేదు. అదే సిని మాతో దర్శకుడిగా పరిచయం కావాలనుకున్నాడు.. అయ్యాడు. చేసింది ఫస్ట్ సినిమా కనీ రన్ టైమ్ విషయం లోనూ రాజీపడకుండా దాన్నే ట్రెండ్‌గా సెట్ చేసి ఇప్పుడు అంతా ఫాలో అయ్యేలా చేశాడు. హీరో క్యారెక్టర్, బిహేవ్ విషయంలో అప్పటి వరకు వచ్చిన తెలుగు సినిమాలకు భిన్నంగా వెళ్లి 'అర్జున్‌రెడ్డి'తో పాత్ బ్రేకింగ్ బ్లాక్ బస్టర్‌ని సొంతం చేసుకుని టాక్ ఆఫ్ ఇండియా అయ్యాడు. రెండవ సినిమాగా 'యానిమల్' చేసి నెవర్ బిఫోర్ అవతార్‌లో రణ్‌బీర్ కపూర్‌ని చూపించి ఔరా అనిపించాడు 'యానిమల్' బ్లాక్ బస్టర్‌తో రూ.900 కోట్ల క్లబ్‌లో చేరిన సందీప్ త్వరలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో 'స్పిరిట్' మూవీకి శ్రీకారం చుట్టబోతున్నాడు. యానిమల్ మూవీలో యంగ్ రణ్‌బీర్, స్టూడెంట్ రణ్‌బీర్ ఆ తరువాత మెచ్యూర్డ్ రణ్‌బీర్‌గా మూడు వేరియేషన్స్ చూపించి ఆ క్యారెక్టర్‌ని బోల్డ్‌గా మలిచి రణ్‌బీర్‌ని ఒప్పించి తనతో చేయించి సక్సెస్ అయ్యాడు. ఈ విషయంలో బాలీవుడ్ దృష్టిలో శభాష్ అనిపించుకున్నాడు. ఈ క్యారెక్టర్‌ని రణ్‌బీర్ అంగీకరించి చేశాడంటే దానికి సందీప్ వంగ యాటిట్యూడ్ బలంగా పని చేసింది. కంప్లీట్‌గా రణ్‌బీర్ తనకు సరెండర్ అయ్యేలా చేసింది. ఆ యాటిట్యూడ్ ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. 'స్పిరిట్' కోసం ప్రభాస్‌కు జోడీగా సందీప్ క్రేజీ హీరోయిన్ దీపికని అనుకున్నారట. ఆమెతో చర్చలు జరిపి ఫైనల్ చేసుకునే క్రమంలో తను పెట్టిన కండీషన్స్ సందీప్‌కు నచ్చకపోవడంతో తనని ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పిం చినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇది నిజమైతే రెండవ ప్రాజెక్ట్ విషయంలో సందీప్ వ్యవహరించిన తీరుకు అంతా అవాక్కవుతున్నారు. ఎంత స్టార్ హీరోయిన్ అయినా కండీషన్స్ పెడితే అంగీకరించకపోగా తనని ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పిం చడం సందీప్ యాటిట్యూడ్ అనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఆ మాత్రం యాటిట్యూడ్ లేకపోతే సందీప్ బాలీవుడ్‌లో నిలబడలేడని, అందరి దృష్టిని తనవైపు తిప్పుకోలేడని టాలీ వుడ్ వర్గాలు, సినీ లవర్స్ అంటున్నారు. మరి దీపిక ఎపిసోడ్ గురించి సందీప్ ఓపెన్‌గా బరస్ట్ అవుతాడా? అన్నది తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# మంచి సందేశాత్మక చిత్రం "రోమియో"

## - రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు




**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** సందేశాత్మక చిత్రంగా "రోమియో" నిలుస్తుందని, ముఖ్యంగా యువతకు హత్తుకునేలా ఉంటుందని రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు శుక్రవారం అన్నారు. స్థానిక పి.ఎన్ కాలనీలో ఉన్న వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో రొమియో ఇండిపెండెంట్ చిత్రం ముహూర్తపు సన్నివేశాన్ని రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు క్లాప్ కొట్టి ప్రారంభించి మాట్లాడుతూ ఈ దేవాలయంలో పూజ కార్యక్రమం జరుపుకున్న చిత్రాలన్నీ విజయవంతం అయ్యాయని, ఈ చిత్రం కూడా ఆ విగ్నేశ్వరుని ఆశీస్సులతో విజయం సాధిస్తుందన్నారు. శ్రీకాకుళం నుండి ఉత్తమ కళాకారులున్నారని, వారి ప్రతిభను బయట ప్రపంచానికి తెలియజేయటం హర్షణీయమన్నారు. ఈ చిత్రంలో నటించే ప్రతీ ఒక్కరూ కష్టపడి నటించారని, వారి ప్రతిభను ప్రత్యక్షముగా చూశానన్నారు. రోమియో చిత్రం మంచి విజయం సాధించి మన కళాకారులకు, చిత్ర దర్శక, నిర్మాతలకు, నటీ, నటులకు, సహాయ నటులకు, చిత్ర యూనిట్ సభ్యులకు మంచి పేరు, ప్రఖ్యాతులు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమములో చిత్ర హీరో, కెమెరా మాన్, డైరెక్టర్ ఐన తేజ్ మహేంద్ర, డైరెక్టర్ ప్రేమ్ సుప్రీమ్, డైరెక్టర్ తారక్, సీనియర్ నటులు రమేష్ నారాయణ్, అగ్గున బాబురావు, రమణ మణిగాము, సహజ నటుడు సాయి సుధాకర్, ఇతర నటి, నటులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతునికి కలెక్టర్ విజయ క్రిష్ణన్ త్రిచక్ర వాహనం వితరణ



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ వినతి మేరకు అచ్యుతపురం సెజ్‌లో ఉన్న టొయోట్సా రేర్ ఎర్త్ జపాన్ కంపెనీ వారు సి ఎస్ ఆర్ నిధులతో త్రిచక్ర హెూండా యాక్టీవ్ వాహనన్ని శుక్రవారం ఉదయం కలెక్షరేట్ ఆవరణలో రావికమతం మండలం రోచుపణుకు గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభా వంతుడైన తూర్రి రవి లబ్ధిదారుడికి కలెక్టర్ చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సుధాకర్, కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మురళీధర్, కంపెనీ క్వాలిటీ కంట్రోల్ హెడ్ ఆర్ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ పార్లమెంటరీ మినీ మహానాడులో గండి బాబ్జిని, పీలా శ్రీనివాసరావుని కలిసిన అగనంపూడి టిడిపి నాయకులు




**విశాఖ, (రాజధాని వార్తలు):** విశాఖ సిటీ టిడిపి కార్యాలయంలో జరిగిన మినీ మహానాడులో విశాఖ పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులు. ఏపీఓసి చైర్మన్ గండి బాబ్జిని విశాఖ మేయర్ పిలా.శ్రీనివాసరావుని జీవీఎంసీ 85 వార్డ్ విశాఖ పార్లమెంటరీ టిడిపి నాయకులు నిల్లి శ్రీనివాసరావు మళ్లీ రెడ్డి సత్యనారాయణ ఎదురు గౌరీశ్వరరావు దానబాల పైడికొండ వంకర రాముపూడి సత్యారావు దుల్ల చెల్లారావు మర్యాదపూర్వకంగా కలిసి కూర్మన్నపాలెం నుండి లంకెల పాలెం వరకు మెట్రో సిటీ పొడిగించాలని ,అగనంపూడి ఎర్రదెబ్బల వద్ద గురు పాఠశాలకు కేటాయించిన 16 ఎకరాలు రద్దుచేసి అగనంపూడి ప్రత్యేక మండలంగా ప్రకటించి ఆ ప్రాంతంలో మండల కార్యాలయంలు, క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని, రైతు బజారు ఏర్పాటు చేయాలని, హెూమి బాబా క్యాన్సర్ ఆస్పత్రిలో స్థానికులకి ఉపాధి కల్పించాలని. అగనంపూడి తలారివారి పాలెం రైల్వే ట్రాక్ బ్రిడ్జి అండర్ గ్రౌండ్ రోడ్డు వెయ్యాలని అగనంపూడి ప్రాంతంలో అన్న క్యాంటీన్ నిర్మించాలని విన్నవించుకోవడం జరిగినది.

# నేడు జిల్లాలో ఇరవై సూత్రాల కార్యక్రమం అమలు తీరుపై చైర్మన్ లంక దీనకర్ సమీక్ష




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాలు, ప్రాజెక్టులపై శనివారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇరవై సూత్రాల కార్యక్రమం అమలు తీరుపై చైర్మన్ లంక దినకర్ సమీక్షించనున్నాట్లు ఈ మేరకు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 24వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో అమలు అవుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, పీఎం గ్రామీణ సడక్ యోజన, వ్యవసాయం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన మరియు టిడ్కో గృహాలు, అమృత్ 1.0 మరియు 2.0, లాఖ్ పతి దీదీస్, ఎస్.హెచ్.జీలకు డ్రోన్స్, విశ్వకర్మ, పీఎం స్వనిధి, గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, పీఎం సూర్యఘర్ మరియు కుసుమ్ తదితర పథకాల అమలు తీరును సంబంధిత అధికారులతో చైర్మన్ సమీక్షించనున్నట్లు చెప్పారు. గత ఐదేళ్లలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన, ఎరువుల సబ్సిడీ, జాతీయ గోకుల్ మిషన్ – పాల ఉత్పాదకత మరియు ప్రస్తుత స్థితిగతులపై సమావేశంలో చర్చించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. వీటితో పాటు జిల్లాలోని పర్యాటక అభివృద్ధి కార్యకలాపాలు, పారిశ్రామిక పార్కులు, మున్సిపాలిటీల పరిధిలోని మురికివాడల అభివృద్ధి, తాగునీటి సరఫరా తదితర అంశాలపై సమీక్ష జరగనుందని కలెక్టర్ తెలియజేసారు. సంబంధిత అధికారులందరూ పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

# నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దేవాలయ అభివృద్ధి పనులను పర్యవేక్షించిన శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ







**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దేవాలయ అభివృద్ధి పనులను మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శుక్రవారం పర్యవేక్షించారు. దేవాదాయ శాఖ అధికారులతో సుదీర్ఘంగా 4 గంటలు సమీక్ష సమావేశం నిర్వహించి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి మరియు జరగబోవు అభివృద్ధి పనుల గురించి చర్చించారు. వాటికి కావలసిన నిధులు, ఇప్పటి వరకు ఖర్చు పెట్టినటువంటి ఖర్చుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు, త్వరితగతిన మిగిలి ఉన్న దేవాలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు, అలాగే దేవాలయ లోపల జరుగుతున్న పనులను పరిశీలించి భక్తులకు అనువుగా ఉండే విధంగా కొన్ని సూచనలు చేసి ఉన్నారు. అందులో భాగంగా దేవాలయంలో వేస్తున్నటువంటి గ్రానైట్ ఫినిషింగ్ టైల్స్ ను వాడకూడదని దీనిని మార్చి రఫ్ గ్రానైట్, న్యాచురల్ స్టోన్ ఫ్లోరింగ్ వేయమని ఆదేశించారు. అలాగే ఆలయ ప్రాంతమంతా సుందరంగా తీర్చిదిద్దాలని, దేవాలయంలో ఏసీలు మరియు విద్యుత్ దీపాలు విరివిగా ఏర్పాటు చేయాలని సూచించారు, దేవాలయ ప్రాగణం లో ఇకపై చేయు అభివృద్ధి పనులు మాస్టర్ ప్లాన్ ప్రకారం, నాణ్యతా ప్రమాణాలతో చేయాలని, మాస్టర్ ప్లాన్ కు కావలసిన ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు, అదేవిధంగా దేవాలయానికి కావలసినటువంటి భూములు కొనుగోలు చేయడానికి సంబంధిత యజమానులతో సంప్రదించాలని అధికారులను ఆదేశించారు.

భక్తుల సౌకర్యార్థం కావలసినటువంటి ఏర్పాట్లు మరియు భక్తుల సౌకర్యార్థం కుంకుమ పూజలు, వివిధ పవిత్ర దినాలలో ప్రత్యేక పూజలు నిర్వహించాలని సూచించారు. పై కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వి రాంబాబు, దేవాదాయ శాఖ డీఈఈ కృష్ణ, ఉపసపతి శ్రీనివాసా చార్యులు, ఏఈ శివప్రసాద్, జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి, ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి, దేవాలయ సిబ్బంది, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పక్షో రక్షితి రక్షితః

## - పక్షుల సంరక్షణతోనే, పర్యావరణ పరిరక్షణ - సామాజిక, సంఘ సేవకులు ఉర్లం.శివతేజ పట్నాయక్






**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** పక్షో రక్షిత రక్షితః, పక్షుల సంరక్షణతో, పర్యావరణ పరిరక్షణ కాపాడగలమని సామాజిక, సంఘ సేవకులు లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మార్కెటింగ్ ఛైర్పర్సన్ లయన్ ఉర్లం. శివతేజ పట్నాయక్ శుక్రవారం అన్నారు. పక్షుల ప్రాముఖ్యత, వాటి సంరక్షణ అవసరాలపై మాట్లాడుతూ పక్షులు, పర్యావరణానికి, మానవ జీవనానికి చాలా అవసరమని, విత్తనాలను వ్యాప్తి చేయడం, పురుగులను తినడం, పర్యావరణ వ్యవస్థను సమతుల్యం చేయడంలో సహాయపడతాయన్నారు. చాలా పక్షులు పురుగులను తింటాయని, దీనివల్ల పంటలకు నష్టం కలగకుండా ఉంటుందని, పక్షుల గొంతు, రూపం, నడక మనకు ఆనందాన్ని కలిగిస్తాయన్నారు. అంతరించిపోతున్న కొన్ని జాతుల పక్షులను సంరక్షించాలని, పూర్వం పల్లెల్లో విరివిగా పక్షులకు ఆహారం అందిస్తూ పెంచుకునేవారని, ఆరుబయట వాటినివాసం కోసం పొడవాటి కర్రను పాతిపెట్టి ఒక చెక్క పెట్టెను అమర్చేవారని గుర్తుచేశారు. కొన్ని పక్షుల కనుమరుగకు పరోక్షముగా మనమేనని, వాయు కాలుష్యం వలనో, శబ్ద కాలుష్యం చేతనో, ఇతరాత్ర కారణాలతో పక్షులు అంతరిచిపోయావన్నారు. వేసవిలో నీళ్లు లేకపోతే మనమెలా ఉండాలేమో, మూగ జీవులు, పక్షులు సైతం అంతేనని, చిన్న పక్షి గూడులను తయారుచేసి మిద్దెలపై ఉంచితే వాటికి నివాసం అందించగలమని, నేను అలానే చేశానన్నారు. వీలైనంత వరకు ఉడతలకకు, పక్షులకు, మూగజీవులకు ఆహారాన్ని, నీటిని అందించి, స్వచ్ఛమైన ప్రేమను పొందాలన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan